క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ ప్రసాద్

సాలూరు: ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేవీఎస్‌ఎస్ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన బస్సులను మంగళవారం తనిఖీ చేశారు. ఆర్‌సీ, ఎఫ్‌సీ, పర్మిట్, ఐసీ, తదితర రికార్డులను కచ్చితంగా వెంట ఉంచుకోవాలని సూచించారు. పరిమితికి మించి పిల్లలను బస్సుల్లో తీసుకువెళ్లరాదని, అటెండెంట్ తప్పకుండా బస్సులో ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా..


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై ఎం.రాజేష్ కోరారు. మండలంలోని జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలైన గంజాయి, డ్రగ్స్, గుట్కా, తంబాకు, వంటి వాటికి బానిసైతే ఆరోగ్యం పాడవుతుందని, భవిష్యత్ అంధకారంగా మారుతుందని వివరించారు. నిషేధిత పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని సూచించారు. దీనిపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు


వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

సీతానగరం: మండల పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలని, పెండింగ్ చలానాలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని ఎస్సై ఎం.రాజేష్ కోరారు. మండల కేంద్రంలోని పలు ప్రధాన కూడళ్లలో మంగళవారం సాయంత్రం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. సరైన వాహన ధ్రువపత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న వారికి అపరాధ రుసుం విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు.

సీఆర్‌పీఎఫ్ బలగాల ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు, విద్యార్థులు

మక్కువ: స్వాతంత్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణారావు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన మక్కువలో మంగళవారం సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు, విద్యార్థులు అన్ని వీధుల్లో జాతీయ జెండాలు చేతపట్టుకొని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ముందుకుసాగారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణారావు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని దేశభక్తిని చాటాలని కోరారు.

దశపర్ణి కషాయంతో చీడపీడల నివారణ

జియ్యమ్మవలస: మండలంలోని చింతలబెలగాం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ జి.అన్నపూర్ణ మంగళవారం దశపర్ణి కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. పది రకాల ఆకులతో ఈ కషాయాన్ని తయారు చేస్తారు కాబట్టి దీన్ని దశపర్ణ కషాయంగా పేర్కొంటారని వివరించారు. వేప, సీతాఫలం, కాగు, మామిడి, జిల్లేడు, నేరేడు తదితర ఆకులను చూర్ణం చేసి, పచ్చిమిర్చి 50 గ్రాములు, వెల్లుల్లి 50 గ్రాములు మెత్తగా నూరి, పొగాకు కాడలు గుండగా చేసి, పావులీటరు ఆవు మూత్రం, 8 లీటర్ల నీటిలో వీటన్నింటినీ కలిపి 30 నుంచి 45 రోజుల వరకు పులయ బెట్టడం ద్వారా ఈ కషాయాన్ని తయారు చేస్తారన్నారు. దీన్ని పంటలపై పిచికారీ చేయడం ద్వారా కాయతొలుచు పురుగు, రసం పీల్చే పురుగు, పచ్చదోమ, తెల్లదోమ, తదితర చీడపీడలను నివారించవచ్చన్నారు.

భోజనాలు రుచికరంగా వండిపెట్టాలి: డీఈఓ


మధ్యాహ్న భోజన వంటకాలను రుచి చూస్తున్న డీఈఓ పగడాలమ్మ

సీతానగరం: మండలంలోని నిడగల్లు ఉన్నత పాఠశాలను డీఈఓ పగడాలమ్మ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి, పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. అనంతరం హెచ్‌ఎం మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, శతశాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట ఎంఈఓ-2 ఎం.వెంకటరమణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

పేదల ఇళ్లు కూల్చేందుకు కుట్ర


సర్వే చేస్తున్న అధికారులతో మాట్లాడుతున్న గంగునాయుడు

మక్కువ: పేదలు కట్టుకున్న ఇళ్లను కూల్చేందుకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కుట్రలు చేస్తున్నారని, ఇది సరికాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఆరోపించారు. మండలంలోని తూరుమామిడి గ్రామంలో మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించారు. విషయం తెలుసుకున్న గంగునాయుడు గ్రామానికి చేరుకుని అధికారులతో మాట్లాడారు. గతంలో ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు అందించిందని, గ్రామానికి చెందిన పలువురు పేదలు ఆ స్థలంలో పాకలు, రేకులషెడ్‌లు నిర్మించుకున్నారన్నారు. ఇప్పుడు సర్వే పేరిట వాటిని తొలగించడం సరికాదన్నారు. గత పంచాయతీ ఎన్నికల్లో ఓట్లు వేయలేదన్న అక్కసుతో సర్పంచ్ రెడ్డి కృష్ణంనాయుడు పేదలపై కక్షకట్టి ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. అలాగే జగనన్న కాలనీకి అవసరమైన భూ సేకరణలో అనేక అవకతవకలు జరిగాయని, అప్పట్లో ఫిర్యాదు చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. సర్పంచ్ చేసిన అక్రమాలు బయటపడతాయని, టీడీపీలోకి చేరేందుకు పావులు కదుపుతున్నారంటూ గంగునాయుడు ఆరోపించారు. పేదలు కట్టుకున్న ఇళ్లకు రక్షణ కల్పించాలని ఉన్నతాధికారులను కోరనున్నట్లు తెలిపారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల తీరుపై ఆరా..


విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ రామకృష్ణ

మక్కువ: మండలంలోని ములక్కాయవలస మోడల్ పాఠశాలలో ఇటీవల జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నికల తీరుపై ఉన్నతాధికారులు మంగళవారం దర్యాప్తు చేపట్టారు. కాశీపట్నం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి తండ్రి ఎస్‌ఎంసీ ఎన్నికల సమయంలో పసుపుచొక్కా వేసుకొచ్చారని, మరో వర్గానికి చెందిన తల్లిదండ్రులు అక్కడ ఉన్న హోంగార్డు మధుకు ఫిర్యాదు చేయడంతో పాఠశాల ఆవరణలో హోంగార్డు తన చొక్కా విప్పించారని విద్యార్థి తండ్రి అల్లు ఈశ్వరరావు సోమవారం జిల్లా ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని ఎస్పీ ఆదేశాల మేరకు సాలూరు సీఐ రామకృష్ణ దర్యాప్తు చేశారు. పాఠశాలకు చేరుకొని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అలాగే డిప్యూటీ డీఈవో రాజ్‌కుమార్ ఎస్‌ఎంసీ ఎన్నికల తీరుపై ఆరాతీశారు. నివేదకను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

బదిలీ ఎంపీడీఓకు సత్కారం


ఎంపీడీఓ ఈశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర, ఎంపీపీ, సర్పంచ్‌లు

సీతానగరం: ఉద్యోగులు బదిలీలు సహజమని, విధి నిర్వహణలో ప్రజలకు అందించిన సేవలే వారికి గుర్తింపునిస్తాయని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బి.రవణమ్మ అధ్యక్షతన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో మంగళవారం ఎమ్మెల్యే విజయచంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం బదిలీపై సొంత జిల్లాకు వెళ్తున్న ఎంపీడీఓ ఈశ్వరరావును ఘనంగా సత్కరించారు. మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంపీడీఓగా ఆయన అందించిన సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.కుమర వర్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీఎం మోడల్‌లో కూరగాయల సాగు


ప్రాథమిక పాఠశాల వద్ద కూరగాయ విత్తనాలు నాటుతున్న సిబ్బంది

బలిజిపేట: మిర్తివలస పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఏటీఎం మోడల్‌లో కూరగాయ పంటలు సాగు చేస్తున్నారు. ఏఓ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం విత్తనాలు నాటారు. ఏటీఎం సాగు విధానంలో 365 రోజులు పంటలు సాగు చేయడం వల్ల రైతులకు అదనంగా ఆదాయం సమకూరుతుందని ఏఓ తెలిపారు. న్యూట్రీ గార్డెన్ విధానంలో భాగంగా వీటిని సాగు చేస్తున్నట్లు చెప్పారు. తోటకూర, గోంగూర, పాలకూర, బెండ, చిక్కుడు విత్తనాలు, వంగ, టమాటో, మిరపనారులతో పాటు బంతి, పొద్దుతిరుగుడు పువ్వులను నాటినట్లు తెలిపారు. ఇక్కడ పండిన పంటలను పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు వండిపెట్టనున్నట్లు చెప్పారు. ఎంసీఆర్ పి.లక్ష్మి, వీఏఏ ప్రశాంతి, సీఆర్పీ తిరుపతిరావు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల అధిక వినియోగంతో నష్టం


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

వీరఘట్టం: అధిక మోతాదులో ఎరువులు వినియోగిస్తే పంటకు అనర్థం తప్పదని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.రత్నకుమారి సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం చలివేంద్రి గ్రామంలో గాప్(గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్) కార్యక్రమం ద్వారా రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు.

సీతంపేట వ్యవసాయ క్షేత్రం సైంటిస్ట్ ఎస్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సాధారణ ఎరువుల కంటే నానో యూరియా, నానో డీఏపీ వినియోగం వల్ల పంటకు ఎంతో మేలని సూచించారు. చీడ, పీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండల వ్యవసాయశాఖ అధికారి జె.సౌజన్య పాల్గొన్నారు.

దళితుల భుములకు రక్షణ కల్పించాలి


మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మండంగి శ్రీనివాసరావు

పార్వతీపురంటౌన్: దళితుల భుములకు రక్షణ కల్పించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మండంగి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడుతున్న శివ్వాం దళితులకు మంగళవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివ్వాం దళితులకు న్యాయం చేయాలని, కురుపాం మండలంలో రెండు సంవత్సరాల క్రితం సర్వే జరిపిన డి.పట్టా భూమికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండంగి ఇండియా, కురుపాం మండల నాయకులు పత్తిక మోహన్, కిల్లాక కనకారావు, మండంగి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేయాలి


జిల్లా రవాణాశాఖాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

పార్వతీపురంటౌన్: పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ కోరారు. ఈమేరకు మంగళవారం జిల్లా రవాణాశాఖాధికారి శశికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఉన్న అనేక ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థులను బస్సులు, క్యాబ్‌లు, ఆటోల్లో తరలిస్తున్నాయన్నారు. ఫిట్‌నెస్ లేని వాహనాల్లో పరిమితికి మించి పిల్లలను ఎక్కించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన విద్యాసంస్థల యాజమాన్యం, వాహన డ్రైవర్లపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేయాలని కోరారు.

విజృంభిస్తున్న జ్వరాలు


భద్రగిరి సీహెచ్‌సీలో ఒకే మంచంపై చికిత్స పొందుతున్న రోగులు

గుమ్మలక్ష్మీపురం: గత కొన్నిరోజులుగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. జ్వరాలతో బాధపడుతున్న వారితో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. మండల కేంద్రంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు సరిపడా బెడ్లు అందుబాటులో లేకపోవడంతో ఒకే బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు రోగులకు వైద్యం అందిస్తున్నారు. ఆస్పత్రిలో అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణాలను పూర్తిచేసి మరిన్ని బెడ్లు అందుబాటులోకి తీసుకొస్తే రోగులకు సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు అంటున్నారు.

ఇంటర్‌లో అదనపు సీట్ల భర్తీ

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల బాలికల కళాశాలలో అదనపు సీట్లు గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర ఆధ్వర్యంలో మంగళవారం భర్తీ చేశారు. మొత్తం 30 సీట్లకుగాను 28 సీట్లు భర్తీ అయ్యాయి. ఎంపీసీ 8, బైపీసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో 10 చొప్పున సీట్లు భర్తీ చేశారు. కార్యక్రమంలో గురుకులం సెల్ ఇన్‌చార్జి వెంకటరమణ, ప్రిన్సిపాల్ పి.సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

సారాతో ఇద్దరి అరెస్ట్

కొమరాడ: మండలంలోని తులసివలస గ్రామానికి చెందిన గన్నెల ఎర్రయ్య, దేశరకృష్ణ సారా అమ్ముతుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. తులసివలస సమీపంలో సారా విక్రయిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు మాటువేసి పట్టుకున్నట్లు చెప్పారు. వారి వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: ఆర్టీసీ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు తులసీరామ్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ సిబ్బంది, కాంట్రాక్టర్‌తో మంగళవారం చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్ట ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని, పండగ సెలవులు ఇవ్వాలన్నారు. కార్మిక చట్టాల్లో పేర్కొన్న విధంగా కార్మికులకు వేతనాలు చెల్లించాలని లేబర్ అధికారి ఆర్టీసీ యాజమాన్యానికి సూచించారు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్‌కు తెలియజేస్తామని ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. దీనిపై ఈ నెల 21న మరోసారి సమావేశమై చర్చించనున్నట్లు లేబర్ కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి గొర్ల వెంకటరమణ జిల్లా ఉపాధ్యక్షుడు కాంట్రాక్టర్ అవుట్ సోర్సింగ్ నాయకులు గంగాధర, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలపై పని భారం తగ్గించాలి


ఎమ్మెల్యే విజయచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

పార్వతీపురంటౌన్: వీఆర్‌ఏలపై పని భారం తగ్గించాలని వీఆర్‌ఏ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా వేసిన నైట్ డ్యూటీల నుంచి గ్రామ రెవెన్యూ సహాయకులకు మినహాయించాలన్నారు. తెలంగాణాలో అమలువుతన్న విధంగా వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న వీఆర్‌ఓ, అటెండర్, రికార్డు సహాయకుల ఖాళీలను వీఆర్‌ఏలకు ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని కోరారు. నామినీలుగా పనిచేస్తున్న వీఆర్‌ఏలను వీఆర్‌ఏలుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కృష్ణారావు, సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, మండల అధ్యక్షులు, కార్యదర్శులు కె.సుధ, శ్రీను, బాబూరావు, విజయ్, ఎస్.కృష్ణ, బి.దిలీప్, పాలక పుష్ప పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను ఆదుకోండి


ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు వినతిపత్రం అందజేసున్న ఏఐటీయూసీ నాయకులు

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ వైద్య సంస్థల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ కోరారు. ఈమేరకు మంగళవారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందిపై వివక్షను అడ్డుకోవాలని, కార్మిక చట్టం ప్రకారం జీతాలు చెల్లించాలని కోరారు. జిల్లాలో ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆస్పత్రుల్లో 222 మంది కార్మికులు ఉన్నారని, వీరంతా టీవీటీ గ్రూపు ఏజెన్సీ ద్వారా సేవలందిస్తున్నారన్నారు. జీతాలు సక్రమంగా చెల్లించకుండా, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించకుండా ఏజెన్సీ నిర్వాహకులు కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రతీ నెల కార్మికులకు జీతాలు చెల్లించేలా, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సింహాద్రి, దుర్గారావు, అలజంగి కుమారమ్మ, ఎం.చంద్రమౌళి, కావ్య, సుధీర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై టీడీపీ కౌన్సిలర్లు ఏనాడైనా మాట్లాడారా?


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

సాలూరు: టీడీపీ కౌన్సిలర్లు గత మూడేళ్లలో ప్రజా సమస్యలపై ఏనాడైనా మున్సిపల్ సమావేశంలో మాట్లాడారా అని ఆత్మవిమర్శ చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరి రఘు, రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు తదితరులు విమర్శించారు. పట్టణంలో మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ.. టీడీపీ కౌన్సిలర్లు సోమవారం చేసిన ఆరోపణలు అర్థరహితమన్నారు. గత మూడేళ్లలో టీడీపీ కౌన్సిలర్లు ప్రజా సమస్యలపై మాట్లాడిన పాపానపోలేదన్నారు. అధికార పక్షానికి చెందినప్పటికీ ప్రజాసమస్యలపై ప్రజల తరఫున తాము అధికారులను నిలదీశామన్నారు. పలువురు అధికారులు చేసిన అక్రమాలు, అవినీతిని కౌన్సిల్ సమావేశాల్లో ఎండగట్టామని తెలిపారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సంధ్యారాణి పట్టణంలో సామాజిక మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాలని ఆదేశించారని, రెండు నెలలు దాటినా నేటికీ పనులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ నుంచి నిధులు తీసుకువచ్చి ఈ పనులు చేపడతామని చెప్పి రెండు నెలలు పూర్తయిందని గుర్తుచేశారు. మున్సిపాలిటీకి రూ.36 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆ నిధులతో పారిశుద్ధ్య నిర్వహణ, మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టాలని టీడీపీ కౌన్సిలర్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ నిధుల వినియోగానికి సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా రాలేదని అధికారులు అంటున్నారని తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ఏ నిధులు తీసుకొచ్చినా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు సహకరిస్తామని పునరుద్ఘాటించారు.

వ్యర్థాల నిర్వహణపై అవగాహన


కంపోస్టు తయారీపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ కుమారవర్మ

సీతానగరం: గ్రామాల్లో నిర్మించిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు పంచాయతీ పాలకవర్గం కృషిచేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కె.కుమారవర్మ అన్నారు. ఎంపీపీ బి.రవణమ్మ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెదబోగిలిలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను సందర్శించారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరణ, వాటిని వేరు చేయడం, కంపోస్టు తయారీ, తదితర అంశాలపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కంపోస్టును రైతులకు విక్రయించడం ద్వారా సేంద్రియ ఎరువులను ప్రోత్సహించడంతో పాటు పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు.